# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-08-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, అప్పుడే అభివృద్ధి చెందిన భారతం సాధ్యపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ప్రారంభించనున్నారు.
- ❖ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2 వేల 693.90 కోట్ల రూపాయలను విడుదల చేసిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- ❖ గిరిజన విద్యార్థులకు జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలలో ప్రవేశాలకు అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు.

==========================

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని.. అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన `మన్ కీ బాత్` కార్యక్రమం 137వ సంచికలో ప్రధానమంత్రి ఈరోజు ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మాదకద్రవ్య రహిత యువత - అభివృద్ధి చెందిన భారతం అన్న పేరుతో ప్రచారం దేశవ్యాప్తంగా ప్రస్తుతం సాగుతోందన్నారు. యువత పెద్ద సంఖ్యలో ఇందులో భాగస్వాములవుతుండటం సంతోషకరమని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

“పీఎం స్వనిధి యోజన” ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు తమ వ్యాపారాలను విస్తరించుకుంటున్నారని నరేంద్ర మోదీ చెప్పారు. ఒక మహిళ వ్యాపారం వృద్ధి చెందినప్పుడు ఆమె కుటుంబ భవిష్యత్

కూడా మెరుగుపడుతుందన్నారు. పిల్లలకు మెరుగైన విద్య అందుతుందని, ఇంటి అవసరాలు తీరుతాయని.. మహిళల ఆత్మవిశ్వాసం బలపడుతుందని ప్రధానమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

మార్కాపురం జిల్లాలోని వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో మార్కాపురంతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగు నీరు లభించనుంది. "వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు" పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. తొలి దశ ప్రారంభం ద్వారా 10.70 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు విడుదల చేయనున్నారు. మొదటి విడతలో సుమారు లక్షా 19 వేల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇదిలా ఉండగా మార్కాపురం జిల్లా గడ్డపై రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందంటూ.. ముఖ్యమంత్రి సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు.

==========================

రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ నెలలో 61 లక్షల 92 వేల 396 మంది పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం 2 వేల 693.90 కోట్ల రూపాయలను విడుదల చేసిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఈ పింఛన్లను పంపిణీ చేస్తామని చెప్పారు. కొత్తగా మంజూరైన 6 వేల 268 వితంతు లబ్ధిదారులకు సెప్టెంబర్ 1న పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం 2 కోట్ల 51 లక్షల రూపాయలను విడుదల చేసినట్టు మంత్రి తెలిపారు.

==========================

గిరిజన విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడం ద్వారా ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ప్రవేశాలకు అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో పాత్రికేయులతో ఆమె ఈరోజు మాట్లాడుతూ... దీని కోసం విశాఖపట్నం జిల్లా మారికవలసలోని గురుకుల పాఠశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇందులో ఇంటర్మీడియట్ చదివే 600 మంది ప్రతిభావంతులైన ST విద్యార్థులకు నాణ్యమైన రెసిడెన్షియల్ విద్య, వసతి, ఆహారంతో పాటు NEET, IIT-JEE కోచింగ్ అందిస్తామని మంత్రి తెలిపారు.

==========================

రాష్ట్రంలో నీట్ పీజీ (జాతీయ అర్హత) పరీక్షను అత్యంత కట్టు దిట్టమైన ఏర్పాట్ల మధ్య ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలో పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును, పరీక్షా కేంద్రాల్లోని వసతుల కల్పన, విద్యార్థుల హాజరు ఇతర భద్రత ఏర్పాట్లను నేరుగా పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... జిల్లాలో నీట్ పీజీ పరీక్షకు ఐదు పరీక్ష కేంద్రాల్లో 1,159 మందికి గాను 1,147 మంది విద్యార్థులు హాజరయ్యారని, 98.95 శాతం హాజరు నమోదు అయినట్లు తెలిపారు.

==========================

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం ఈరోజు బలపడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. ఇది రాబోయే 24 గంటల్లో ఉత్తర ఒడిశా, గంగా తీర

పశ్చిమ బెంగాల్ మీదుగా పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని తెలిపారు. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా జిల్లాల్లో ఈరోజు, రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు.

===========================

===========================